క్లుప్తంగా

కుట్టు మిషన్ల అందజేత



ధర్మసాగర్: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో నూతనంగా చేరిన బాలికల కోసం దాతలు గురువారం రెండు కుట్టు మిషన్లు బహూకరించారు. ఈ సందర్భంగా బాలికలకు ఒకేషనల్ స్కిల్స్ పెంపొందించేందుకు పాఠశాల పూర్వ విద్యార్థి ప్రభుత్వ ఉపాధ్యాయురాలు తారాబాయి ఆమె తల్లిదండ్రులు బొద్దిరెడ్డి లింగారెడ్డి, వెంకటమ్మల జ్ఞాపకార్థం, మరో పూర్వ విద్యార్థి విశ్రాంత అధ్యాపకుడు ఎల్కుర్తి వాస్తవ్యుడు కేదారి వారి తల్లిదండ్రులు మల్లయ్య, దుర్గమ్మల జ్ఞాపకార్థం రెండు కుట్టు మిషన్లు వితరణ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థులు, విద్యాభిమానులు సహకరించాలని పాఠశాల హెచ్ఎం ధర్మప్రకాష్ కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు తోకల రాజమ్మ, కృష్ణమూర్తి, స్వర్ణలత, కవిత, సురేష్, పద్మజ, కిరణ్మయి, సునీత, తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరాన్ని వినియోగించుకోవాలి



దామెర: ఉచిత వైద్య శిబిరాన్ని వినియోగించుకోవాలని రెడ్‌క్రాస్ వైద్యులు కిషన్ రావు, మదన్ మోహన్ సూచించారు. మండలంలోని ల్యాదెళ్లలో రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో మొబైల్ మెడికేర్ యూనిట్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన పలువురికి పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్లు మాట్లాడుతూ.. 60 సంవత్సరాలు పైబడిన వృద్ధులు ప్రతినెలా బీపీ, షుగర్ పరీక్షలు చేసుకొని వైద్యుల సలహాలు పాటించాలని అన్నారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని వెల్లడించారు. శిబిరంలో సిబ్బంది గుల్లెపెల్లి శివకుమార్, శ్రీకాంత్, గంగాధర్, అనిల్, సుమంత్, శోజు రమేష్, పోశాలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న గీత కార్మికుడి మృతి



ఉమేష్(ఫైల్)

నడికూడ: మండలంలోని రాయపర్తి గ్రామానికి చెందిన గీతకార్మికుడు తాటి చెట్టు పైనుంచి పడి, చికిత్స పొందుతున్న క్రమంలో గురువారం మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. రాయపర్తికి చెందిన మార్క ఉమేశ్(48) ఈ నెల 27న రోజూమాదిరిగానే కల్లు తీయడానికి గ్రామ శివారులోని తాటి వనంలో చెట్టు ఎక్కుతుండగా జారి కింద పడ్డాడు. దీంతో తీవ్రగాయాలు అయ్యాయి. గమనించిన స్థానికులు పరకాల ఆస్పత్రికి అటునుంచి వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం ఉదయం ఉమేశ్ మృతిచెందాడు. ప్రభుత్వం నుంచి సాయం అందించాలని కుటుంబ సభ్యులు కోరారు.

సమస్యలు పరిష్కరించాలి

కేయూ క్యాంపస్: విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని ఏబీఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు మంద నరేష్ డిమాండ్ చేశారు. కాకతీయ యూనివర్సిటీలో గురువారం ఆయన మాట్లాడుతూ అనేక ఏళ్లుగా ఎదురుచూస్తున్న నిరుద్యోగులకు శుభవార్త చెబుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మెగా డీఎస్సీ ప్రకటించడం హర్షించదగిన విషయం అని అన్నారు. అలాగే, రాష్ట్రంలో నెలకొన్న విద్యారంగ సమస్యలపై కూడా దృష్టి పెట్టి పరిష్కరించాలని కోరారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను విడుదల చేయాలని సూచించారు. అధిక ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేట్ యాజమాన్యాలపై చర్య తీసుకోవాలన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని ప్రభుత్వమే ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. సమావేశంలో ఏబీఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బొట్ల నరేష్, యూనివర్సిటీ అధ్యక్షుడు మచ్చ పవన్‌కల్యాణ్, నరేందర్, ప్రణయ్, అఖిల్, సుకురా, సూర్య, సాయికిరణ్ వెంకటేష్, రాజ్‌కుమార్, పృథ్వీరాజ్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు బీజేపీ విజయసంకల్ప యాత్ర

హన్మకొండ: బీజేపీ విజయసంకల్ప యాత్ర మార్చి 1న హనుమకొండ, వరంగల్ జిల్లాలోని వరంగల్ పశ్చిమ, వర్ధన్నపేట, వరంగల్ తూర్పు నియోజకవర్గాల్లో సాగనుందని బీజేపీ నేతలు తెలిపారు. కలిసి కదులుదాం.. మరోసారి బీజేపీని గెలిపిద్దాం, మూడోసారి నరేంద్ర మోదీని ప్రధానిని చేద్దాం అనే నినాదంతో ఈ యాత్ర చేపట్టినట్లు పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం హనుమకొండలోని వేయి స్తంభాల దేవాలయంలో పూజా కార్యక్రమాలు నిర్వహించిన అనంతరం యాత్ర ప్రారంభం కానున్నట్లు తెలిపారు.

సమావేశాన్ని బహిష్కరించిన బీఆర్ఎస్

- వాడీవేడిగా దామెర మండల సర్వసభ్య సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీటీసీ రాము

దామెర: మండల సర్వసభ్య సమావేశాన్ని బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు గురువారం బహిష్కరించారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ కాగితాల శంకర్ అధ్యక్షతన నిర్వహించాల్సిందిగా ఎంపీడీఓ గుమ్మడి కల్పన ఆహ్వానించారు. కాగా, ఎంపీపీ నలుపురంగు కండువా వేసుకొని సమావేశం ప్రారంభించారు. అనంతరం దుర్గంపేట్ బీఆర్ఎస్ ఎంపీటీసీ గండు రాము మాట్లాడుతూ.. ఇటీవల అగ్రంపహాడ్ జాతరలో జరిగిన ఘటనలో వైస్ ఎంపీపీ ఎండీ.జాకిర్‌అలీతోపాటు పలువురు నాయకులను పోలీసులు విచక్షణారహితంగా కొట్టారని అన్నారు. ప్రజాస్వామానికి విరుద్ధంగా రాష్ట్రంలో పాలన కొనసాగుతుందని కన్నీటిపర్యంతమవుతూ భావోద్వేగంతో మాట్లాడారు. జై తెలంగాణ నినాదాలు చేస్తే పోలీసులచే కొట్టిస్తారాని అని ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డిని ప్రశ్నించారు. పరకాల ఏసీపీ కిశోర్ కుమార్‌పై విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. ఇతర ఎంపీటీసీ సభ్యులు సైతం పోలీసులపై ఆగ్రహం వ్యక్తంచేశారు. అనంతరం ఎంపీపీ శంకర్, జెడ్పీటీసీ గరిగె కల్పనకృష్ణమూర్తి మాట్లాడుతూ.. బీఆర్ఎస్ నాయకులపై పోలీసుల దాడికి నిరసనగా సమావేశాన్ని బహిష్కరిస్తున్నట్లు ప్రకటించి బయటికి వెళ్లిపోయారు. అరగంట తర్వాత సమావేశాన్ని వాయిదావేస్తున్నట్లు ఎంపీడీఓ కల్పన ప్రకటించారు.

దాడులు అప్రజాస్వామికం

బీఆర్ఎస్ నాయకులపై పోలీసుల దాడులు అప్రజాస్వామికమని ఆపార్టీ మండల అధ్యక్షుడు గండు రాము అన్నారు. సర్వసభ్య సమావేశాన్ని బహిష్కరించిన అనంతరం విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోని రాగానే బీఆర్ఎస్ నాయకులపై దాడులు పెరిగాయని అన్నారు. పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నారని విమర్శించారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో ప్రజాప్రతినిధులపై దాడులు జరగలేదన్నారు. ఇకపై ఇలాంటి సంఘటనలు పునరావృతంకాకుండా ఎమ్మెల్యే ప్రకాష్ రెడ్డి చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆయా కార్యక్రమాల్లో తహసీల్దార్ జ్యోతివరలక్ష్మీదేవి, వైస్ ఎంపీపీ జాకిర్ అలీ, ఎంపీటీసీలు పోలం కృపాకర్ రెడ్డి, ఎంపీపీ కాగితాల శంకర్, జెడ్పీటీసీ కల్పనకృష్ణమూర్తి, ఎంపీటీసీ కృపాకర్ రెడ్డి, నాయకులు ఉన్నారు.

ఇంటర్ సెకండియర్ పరీక్షలు ప్రారంభం

- మొదటిరోజు 31మంది విద్యార్థుల గైర్హాజరు



పరీక్ష కేంద్రం వద్ద రూం నంబర్ చెక్ చేసుకుంటున్న విద్యార్థులు

పరకాల: 2023–24 విద్యాసంవత్సరం ఇంటర్ రెండో సంవత్సరం పరీక్షలు గురువారం నుంచి ప్రారంభమయ్యాయి. పరకాల ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఎస్వీ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాల్లో జరిగిన ఇంటర్ రెండో సంవత్సరం పరీక్షలకు 536 మంది విద్యార్థులకు 505 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. పరకాల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 269 మంది విద్యార్థులకు 243 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఎస్వీ జూనియర్ కళాశాలలో 267 మంది విద్యార్థులకు 262 మంది హాజరయ్యారు. ఐదుగురు విద్యార్థులు గైర్హాజరయ్యారు. పరకాల ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.సంపత్‌కుమార్, ఎస్వీ విద్యాసంస్థల చైర్మన్ ప్రిన్సిపాల్ డాక్టర్ సిరికొండ శ్రీనివాసాచారి పర్యవేక్షణలో పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టారు. పరీక్షలకు ఎలాంటి ఆటంకం తలెత్తకుండా పోలీసు బందోబస్తుతో సీఐ రవిరాజ్ పర్యవేక్షించారు.

మహా అన్నదానం



అన్నదానం చేస్తున్న హుస్సేన్ దంపతులు

వేలేరు: శివస్వామి మాలధారులకు అన్నదానం చేయడం అదృష్టంగా భావిస్తున్నానని వేలేరు మాజీ ఉపసర్పంచ్ సద్దాం హుస్సేన్– సులోచన దంపతులు అన్నారు. గురువారం స్థానిక రుద్రరామేశ్వరాలయంలో కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శివస్వాములకు మహాఅన్నదానం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ.. కుల, మతాలకు అతీతంగా ప్రజలంతా కలిసి ఉండాలన్నదే తమ అభిప్రాయమని అన్నారు.

కష్టపడి చదివి ఉన్నతంగా ఎదగాలి



ప్యాడ్స్, పెన్నులు పంపిణీ చేస్తున్న భిక్షపతి



పెద్దకోడెపాకలో అందజేస్తున్న ప్రకాశ్‌రెడ్డి

శాయంపేట : విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నతమైన స్థానానికి ఎదిగి తల్లిదండ్రులు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని మత్స్యగిరి స్వామి ఆలయ కమిటీ చైర్మన్ సామల భిక్షపతి అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలికలు, బాలుర ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు గురువారం ఆయన తన తండ్రి సామల వీరేశం జ్ఞాపకార్థం పరీక్ష ప్యాడ్స్, పెన్నులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు పదో తరగతి పరీక్షల్లో 10జీపీఏ సాధించాలని, భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పాఠశాలల ప్రధానోపాధ్యాయులు శ్రీలత, వెంకటేశ్వర్ రావు, ఉపాధ్యాయులు శ్రీనివాస్, సదానందం, హజీముద్దీన్, రాజబాబు, సత్యప్రసాద్, ఉదయశ్రీ, శేఖర్‌బాబు, లీలావతి, యోగిత, కిరణ్మయి, దుర్గ, విద్యార్థులు పాల్గొన్నారు.

పెద్దకోడెపాకలో..

మండలంలోని పెద్దకోడెపాక ప్రభుత్వ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులకు గురువారం విద్యార్థులకు పరీక్ష ప్యాడులు, జామెట్రీ బాక్సులు, పెన్నులు మాజీ సర్పంచ్ అబ్బు ప్రకాశ్‌రెడ్డి విద్యార్థులకు అందజేశారు. ఎన్నారైలు కొండా ప్రభాకర్, కృపాకర్ సోదరుల సహకారంతో విద్యార్థులకు వస్తువులు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు కాసర్ల చంద్రమౌళి పాల్గొన్నారు.

దామేశ్వరాలయ ప్రతిష్ఠాపనోత్సవాలు ప్రారంభం

- మూడు రోజుల పాటు నిర్వహణ
- 3న శివలింగం, దేవతామూర్తుల ప్రతిష్ఠాపన



గణపతి పూజ నిర్వహిస్తున్న పండితులు

దామెర: మండల కేంద్రంలోని కాకతీయులనాటి పురాతన శివాలయం (దామేశ్వరాలయం) పునఃప్రతిష్ఠాపన కార్యక్రమంలో భాగంగా గురువారం అంకురార్పణ పూజలు నిర్వహించారు. భాగంగా గణపతి పూజ, స్వస్తిపుణ్యాహవచనం, పంచగవ్యారాధన, కార్యక్రమాలను వేదపండితుల మంత్రోచ్ఛరణ మధ్య నిర్వహించారు. అనంతరం దేవతామూర్తుల విగ్రహాలు, ధ్వజస్తంభం గ్రామంలో శోభయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు మంగళహారతులతో స్వాగతం పులకుతూ టెంకాయలు సమర్పించారు. శివం ట్రస్ట్ చైర్మన్ బిల్లా రమణారెడ్డి మాట్లాడుతూ.. శుక్రవారం గణపతిపూజ, అగ్నిప్రతిష్ఠ, దేవతాహ్వానం, జలాధివాసం, సామూహిక కుంకుమార్చన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అదే విధంగా మార్చి2న కుంభేషా పూజ, ఫలపుష్పధాన్యాధివాసములు, సామూహిక కుంకుమార్చనలు ఉంటాయన్నారు. 3న మూల మంత్రానుష్ఠా నహవనములు, దేవమస్తకాభిషేకం, ఉదయం 9.45 గంటలకు అపురాధ నక్షత్రయుక్త లగ్నమున శివలింగ ప్రాణప్రతిష్ఠ పూర్ణాహుతి, మహాకుంభాభిషేకం, శాంతి కల్యాణం గన్నవరం పీఠాధిపతి కమలానంద భారతితీర్థ స్వామి ఆధ్వర్యంలో, భద్రకాళీ ఆలయ ప్రధాన అర్చకులు శేషులచే పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. అంకురార్పణ పూజా కార్యక్రమంలో న్యాయవాది ముద్దసాని సహోదర్ రెడ్డి, గంగిడి శ్రీధర్ రెడ్డి, పోల్సాని అనిల్ రెడ్డి, చందుపట్ల సత్యవర్ధన్ రెడ్డి, ఎంపీటీసీ పోలం కృపాకర్ రెడ్డి, మాజీ సర్పంచ్ గురిజాల శ్రీరాంరెడ్డి, దామెరుప్పుల శంకర్, మేరుగు కుమార్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి చేయూత



ఆర్థికసాయం అందజేస్తున్న నాయకులు

ఆత్మకూరు: మండలంలోని అక్కంపేటలో ఇటీవల నల్లాన్‌చక్రవర్తుల లక్ష్మమ్మ అనారోగ్యంతో మృతిచెందగా రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు అల్లం బాలకిషోర్‌రెడ్డి చేయూతనందించారు. గురువారం రూ.10వేలు అందించారు. అలాగే బాధిత కుటుంబానికి ఎల్లవేళలా అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా నాయకుడు అల్లం మర్రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ ముద్దం సాంబయ్య, అసెంబ్లీ యూత్ కన్వీనర్ మాదాసి శ్రీధర్, ముద్దం కృష్ణంరాజు, కందికొండ రాజు, క్రాంతి, ఓదెల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు టాలెంట్ టెస్ట్



టెస్టు రాస్తున్న విద్యార్థులు

ఎల్కతుర్తి: భీమదేవరపల్లి మండలం ముల్కనూర్ గ్రామంలోని ఎస్ఆర్‌టీ కోఆపరేటివ్ జూనియర్ కళాశాలలో ఓమైజయా యునైటెడ్ యంగ్ స్టార్స్ అసోసియేషన్, ఎస్ఆర్‌టీ జూనియర్ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు గురువారం టాలెంట్ టెస్టు, కెరీర్ మార్గదర్శకత్వంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు రూ.10వేల నగదు బహుమతితో, జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యతిథిగా షైన్ విద్యాసంస్థల అధినేత, టీపీజేఎంఏ సహాయ కార్యదర్శి కుమార్‌యాదవ్ మాట్లాడారు. విద్యార్థులు కష్టంతో కాకుండా ఇష్టపడి చదివి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. ఉత్తమ ఫలితాలు సాధించినప్పుడే విద్యార్థులకు భవిష్యత్‌లో మంచిపేరు ప్రతిష్ఠలు లభిస్తాయని సూచించారు. కాగా, హుజూరాబాద్, ఎల్కతుర్తి, భీమదేవరపల్లి మండలాల నుంచి 15 ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు చెందిన 170మంది విద్యార్థులు టాలెంట్ టెస్టులో పాల్గొన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రోగ్రాం ఆర్గనైజర్ హుస్సేన్, టీం సభ్యులు సుష్మ, వంశీ, బుద్ధగౌడ్, ఈశ్వర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పోలీసుల వ్యవహారంలో 'రేవూరి' జోక్యంలేదు

- కమలాపురం రమేశ్



సమావేశంలో మాట్లాడుతున్న రమేష్

ఆత్మకూరు: పోలీసు వ్యవహారాల్లో జోక్యం చేసుకునే అవసరం ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్‌రెడ్డికి లేదని ఆయనపై పనికిమాలిన ఆరోపణలు చేయడం మాజీ ఎమ్మెల్యే ధర్మారెడ్డి, బీఆర్ఎస్ నాయకులకు తగదని కాంగ్రెస్ మండలఅధ్యక్షుడు కమలాపురం రమేష్ అన్నారు. మండలకేంద్రంలో గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఇటీవల బీఆర్ఎస్ నాయకులపై పోలీసు కేసు విషయంలో కాంగ్రెస్ పార్టీని విమర్శించడం వారి అవివేకానికి నిదర్శమన్నారు. గతంలో బీఆర్ఎస్ పాలనలో మహిళలపై ఎన్నో అరాచకాలు జరిగాయని, భూకబ్జాలకు పాల్పడ్డారని కనీసం వారిని పార్టీ నుంచి తొలగించలేని ఘనత అప్పటి పాలకులదన్నారు. ఎవరేమిటో ప్రజలకు తెలుసన్నారు. ఇప్పటికైనా ఆలోచించి మాట్లాడాలని హితవు పలికారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు బీరం సుధాకర్ రెడ్డి, కక్కెర్ల రాజు, వర్కింగ్ ప్రెసిడెంట్ పరికిరాల వాసు, గ్రామఅధ్యక్షుడు బయ్య కుమారస్వామి, మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఎండీ.ఖాజా, సొసైటీ డైరెక్టర్ రేవూరి జయపాల్‌రెడ్డి, కోల రమేష్, అలువాల రవి తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ



పరామర్శిస్తున్న బుచ్చిరెడ్డి

శాయంపేట : మండలంలోని పత్తిపాక గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు చిట్టిరెడ్డి సాంబరెడ్డి భార్య సమ్మక్క అనారోగ్యంతో గురువారం మృతి చెందింది. కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు దూదిపాల బుచ్చిరెడ్డి ఆమె భౌతిక కాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట ఎంపిటిసీ గజ్జి ఐలయ్య, నాయకులు దుబాసి కృష్ణమూర్తి, మారెపల్లి కట్టయ్య, వరద రాజు, జంగారెడ్డి ఉన్నారు.

ఇళ్ల పట్టాలు ఇప్పించండి



వెంకట్‌రెడ్డికి విన్నవిస్తున్న గుడిసె వాసులు

ఎల్కతుర్తి: భీమదేవరపల్లి మండలం ముల్కనూర్ శివారులో గత కొద్దికాలం క్రితం నిరుపేదలు ప్రభుత్వ స్థలంలో గుడిసెలు వేసుకున్న విషయం తెలిసిందే. కాగా, గురువారం సీపీఐ జాతీయ కార్యదర్శివర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి ఆ స్థలాలను పరిశీలించగా గుడిసె వాసులు అక్కడికి చేరుకొని సారూ ప్రభుత్వంతో మాట్లాడి ఇళ్లపట్టాలు ఇప్పించండి.. అని వేడుకున్నారు. నివాసానికి అవసరయ్యే కరెంట్, నీటి వసతి కల్పించేందుకు చొరవచూపాలని కోరారు. ఈ సందర్భంగా వెంకట్ రెడ్డి మాట్లాడుతూ.. గుడిసెల వద్ద మౌలిక వసతుల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టే విధంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అంతకుముందు ముల్కనూర్ గ్రామానికి చెందిన పెంటపూర్తి దివాకర్‌రెడ్డి ఇటీవలే మృతి చెందగా ఆయన కుటుంబసభ్యులను వెంకట్‌రెడ్డి పరామర్శించారు. కార్యక్రమంలో ఆయన వెంట సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు ఆదరి శ్రీనివాస్, కొంగల రామ్‌చంద్రారెడ్డి, మార్పు కృష్ణారెడ్డి, రమేష్, బాలరాజు, సంజీవరెడ్డి, కిషన్, కుమారస్వామి తదితరులు ఉన్నారు.

గొల్లకురుమలకు నగదు బదిలీ చేయాలి



శ్రీహరికి వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

ధర్మసాగర్: రాష్ట్ర ప్రభుత్వం గొల్ల కురుమలకు నగదు బదిలీ చేయాలని గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శాతబోయిన రమేష్, కాడబోయిన లింగయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు సంఘం మండల కమిటీ ఆధ్వర్యంలో గురువారం స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరిని కలిసి వినతి పత్రం అందచేసి, మాట్లాడారు. జిల్లాలో 7,318 మందికి గొర్ల పంపిణీ చేయాల్సి ఉండగా 2,225 మంది అప్పులు తెచ్చి డీడీలు కట్టి సంవత్సరాలు గడుస్తున్నాయన్నారు. వీరిలో 1,135 మందికి గొర్లను పంపిణీ చేసి మిగతా 1,090 మందికి పంపిణీ చేయలేదని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే మేనిఫెస్టోలో పెట్టిన ప్రకారం రూ.2లక్షల నగదు బదిలీ ద్వారా గొల్ల కురుమల వ్యక్తిగత ఖాతాలో జమ చేయాలని కోరారు. గొర్లు, మేకల మేత సందర్భంలో కాపరులు అనేక ప్రమాదాల బారిన పడుతున్నారని, అలాంటివారికి రూ.10లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం కడియం శ్రీహరి మాట్లాడుతూ.. గొల్ల కురుమల సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. పశుసంవర్ధక శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీకి లేఖ రాస్తానని చెప్పారు. వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో ఈ సమస్యను లేవనెత్తుతానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సంఘం జిల్లా నాయకులు వేల్పుల రమేష్, చిగుర్ల చేరాలు, నల్లబెట్ట చిన్నరాజు, పింజర్ల రాజకుమార్, మామిళ్ల కుమార్, కొడారి చిరంజీవి, సురేష్ పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములను పరిరక్షించాలి

వరంగల్: వరంగల్ మండలం ఏనుమాముల ప్రాంతంలోని ప్రభుత్వ భూములను రక్షించాలని స్థానికులు కోరారు. ఈమేరకు తహసీల్దార్ ఎక్బాల్‌కు గురువారం వినతిపత్రం అందజేశారు. మండల పరిధిలోని ముసలమ్మకుంట వద్ద ఉన్న ప్రభుత్వ భూములను కొంతమంది వ్యక్తులు, రియల్టర్లు.. ఎస్సీలను అడ్డం పెట్టుకుని విక్రయించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని తెలిపారు. మట్టిని తవ్వించి అమ్మకాలు చేస్తున్నారని పేర్కొన్నారు.

పులుకుర్తిలో మందుబాబుల హల్‌చల్

- దేవాలయ ప్రాంగణంలో మద్యం సీసాలు



ఆలయ ప్రాంగణంలో మద్యం సీసాలు, గ్లాసులు

దామెర: మండలంలోని పులుకుర్తిలో మందుబాబులకు అడ్డూ.. అదుపు లేకుండా పోయింది. ఏకంగా ఆంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలోనే బుధవారం రాత్రి మద్యం తాగి ఖాళీ సీసాలు అక్కడే పడేయగా గ్రామస్తులు గురువారం గుర్తించి, మందుబాబులపై ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. గ్రామం సమీపంలోని రంగనాయకులు గట్టువద్ద ఆలయ ప్రాంగణంలో గుర్తుతెలియని వ్యక్తులు మద్యంతాది ఖాళీ సీసాలు, గ్లాసులు అక్కడే పడేసి వెళ్లారు. అక్కడే ఉన్న వాటర్ ట్యాంకర్ గేట్ వాల్వ్‌ను ధ్వంసం చేడయంతో ట్యాంకర్‌లోని నీరు వృధాగా పోయింది. గ్రామానికి చెందిన వాట్సప్ గ్రూప్‌లో ఈ విషయం చక్కర్లు కొట్టడంతో మందుబాబులను గుర్తించి వారిపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. ఇదిలా ఉండగా గత కొద్ది రోజుల క్రితంసైతం గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో ఇలాంటి దృశ్యాలు కనిపించడంతో మందుబాబుల ఆగడాలపై గ్రామంలో చర్చనీయాంశంగా మారింది. ఇలాంటి చర్యలు పునరావృతం కాకుండా రాత్రి వేళ్లలో పోలీసు గస్తీ పెంచాలని కోరుతున్నారు.

సన్మాన సభను విజయవంతం చేయాలి



విలేకరులతో మాట్లాడుతున్న శ్రీనివాస్‌గౌడ్

కమలాపూర్: మార్చి 10న ఉమ్మడి కరీంనగర్ జిల్లా గౌడ సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో కరీంనగర్‌లో నిర్వహించే రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ సన్మాన సభను విజయవంతం చేయాలని ఐక్య వేదిక జిల్లా అధ్యక్షుడు తాళ్లపెల్లి శ్రీనివాస్‌గౌడ్ పిలుపునిచ్చారు. కమలాపూర్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పొన్నం ప్రభాకర్‌గౌడ్ విద్యార్థి నాయకుడిగా, ఎన్ఎయూఐ రాష్ట్ర అధ్యక్షుడిగా, మార్క్‌ఫెడ్ చైర్మన్‌గా అంచెలంచెలుగా ఎదిగి దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో ఎంపీగా పని చేసి, ప్రస్తుతం రాష్ట్ర మంత్రిగా కొనసాగడం హర్షనీయమన్నారు. కరీంనగర్‌లో నిర్వహించే కార్యక్రమానికి గీత కార్మికులు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో శంకరపట్నం మాజీ జెడ్పీటీసీ బత్తిని శ్రీనివాస్‌గౌడ్, నాయకులు బాలసాని రమేష్‌గౌడ్, దేశిని ఐలయ్యగౌడ్, జనగాని శివకృష్ణగౌడ్, గట్టు శ్రీధర్‌గౌడ్, పల్లె సంతోష్‌గౌడ్, రమేష్‌గౌడ్, బాలసాని రవిగౌడ్ పాల్గొన్నారు.

పరకాల ఆర్డీఓగా నారాయణ



పరకాల: పరకాల ఆర్డీఓగా కె.నారాయణ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేసిన శ్రీనివాస్ రెంద్రోజుల క్రితం కొల్లూరుకు బదిలీ అయ్యారు. ఈసందర్భంగా నారాయణను పరకాల, నడికూడ, దామెర, ఆత్మకూరు, శాయంపేట తహసీల్దార్లు, ఆర్డీఓ కార్యాలయ ఉద్యోగులు మర్యాద పూర్వకంగా కలిసి అభినందించారు.

కేటీఆర్‌కు స్వాగతం పలకాలి

- ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి

శాయంపేట : మేడిగడ్డ సందర్శనకు వస్తున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల తారకరామారావుకు మండలంలో మాందారిపేట స్టేజీ వద్ద పార్టీ శ్రేణులు, కార్యకర్తలు స్వాగతం పలకాలని ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి పిలుపునిచ్చారు. గురువారం ఆయన నేరేడుపల్లి కార్యకర్తలతో మాట్లాడారు. కేటీఆర్‌కు స్వాగతం పలికేందుకు పార్టీ శ్రేణులు భారీ ఎత్తున రావాలని కోరారు. అనంతరం మండలంలోని నేరుడుపల్లి, వసంతాపూర్ గ్రామాల్లో జరిగిన వివాహ వేడుకల్లో, అప్పయ్యపల్లిలో గృహప్రవేశ వేడుకలో పాల్గొన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ మాజీ అధ్యక్షుడు గుర్రం రవీందర్, పీఏసీఎస్ డైరెక్టర్ భాగ్య, మాజీ కో ఆప్షన్ సభ్యుడు ఎస్‌కే గౌస్, నాయకులు సంజీవరావు, గణేష్, రాకేష్, సతీష్, విజయ్, రాజేందర్, రవి పాల్గొన్నారు.